## కొనసాగుతున్న బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే


సర్వే నిర్వహిస్తున్న హెచ్ఎం, సీఆర్పీ

కోటపల్లి, డిసెంబర్ 16 : కోటపల్లి మండలంలో బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే కొనసాగుతున్నది. సీఆర్పీలో వారి పరిధిలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో గ్రామాల్లో తిరుగుతూ బడి బయటి పిల్లలను గుర్తిస్తున్నారు. కోటపల్లి మండలంలోని ఎసన్వాయి గ్రామంలో పాఠశాల హెచ్ఎం సుశాంత్, సీఆర్పీ సంపత్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. బడి బయటి పిల్లలను గుర్తించి, వారిని సమీపంలో ఉన్న పాఠశాలల్లో చేర్పించారు.

## భీమారం ఊర చెరువు సర్వే


చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

భీమారం, డిసెంబర్ 16 : భీమారం ఊర చెరువును ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. చెరువు భూమి ఎంత.., ఎఫ్టీఎల్ ఎక్కడ వరకు ఉంది.., కబ్జా ఎంత జరిగింది.., హద్దులు ఎక్కడ ఉన్నాయని ఇరిగేషన్ డీఈ శారద గుర్తించారు. సర్వే నంబర్ 570 ఊర చెరువుతో పాటు, శిఖం భూమి 2020లో 14 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు వారు తెలిపారు. ఇప్పుడు 11 ఎకరాలుగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు. కబ్జాలోకి వచ్చిన వారికి గ్రామ పంచాయతీ అధికారులతో త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఇందులో ఏఈ అకిల్, సర్వేయర్ నాగరాజు గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

■ పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 16 : చెన్నూర్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి సూచించారు. మండలంలోని బావురావుపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను దళారుల మాటలు నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా వారి ఖాతాల్లో డబ్బు జమచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల మౌనిక, నాయకులు సంపత్ గౌడ్ రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి

# విద్యార్థులు కలలను నెరవేర్చుకోవాలి

■ అదనపు కలెక్టర్ బీ రాహుల్

■ భీమారం జడ్పీ పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

భీమారం, డిసెంబర్ 16 : విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవాలని, రానున్న రోజుల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ బీ రాహుల్ సూచించారు. భీమారం మండల కేంద్రంలోని జడ్పీపాఠశాలలో శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కలలు కన్నమార్గంలో సాగాలంటే పలు అంశాలను వారికి వివరించారు. డిమాండ్ ఉన్న రంగాలను ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ రావు, ఏపీఎం త్రియంబకేశ్వర్, తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణ, ఎస్ఐ రాజావర్ధన్, పశువైద్యాధికారి రాకేశ్ శర్మ, ఏఈ రవి, ఎంపీవో సతీశ్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


భీమారం : అదనపు కలెక్టర్ రాహుల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

### విద్యతోనే విద్యార్థులకు గుర్తింపు

జైపూర్, డిసెంబర్ 16 : విద్యతోనే విద్యార్థులకు భవిష్యతులో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో పాటు ఇష్టపడి చదివితే ఉన్నతస్థానాలకు చేరుకుంటారని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని, వాటి కోసం కష్టపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ, ఎంపీటీసీ లింగస్వామి, వైద్యాధికారిణి సింధూర, ప్రిన్సిపాల్ ఆలేస్ మాధుర్య, అదనపు ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

# వారసత్వ హక్కు పునరుద్ధరించాం

■ సింగరేణిలో అనేక హక్కులు సాధించాం

■ కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్

కాసిపేట, డిసెంబర్ 16 : సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు కాలరాసిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించామని, 12వేల మందికి పిల్లలకు ఉపాధి కల్పించామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్ కుమార్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియా కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై శనివారం టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలతో పాటు అనేక హక్కులను జాతీయ సంఘాలు పోగొట్టాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 3,400 ఉద్యోగాలను డిపెండెంట్లకు ఇచ్చినట్లు చెప్పారు. ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 3,800 నూతన ఉద్యోగాలు, 600 మంది డిస్మిస్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు వివరించారు. లాభాల వాటా 16 శాతం నుంచి 32 శాతానికి పెంచామని, కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం, రూ.10 లక్షల ఇంటి రుణానికి వడ్డీ తిరిగి చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికుల పిల్లలకు ట్యూషన్ ఫీజు, రీయింబర్స్‌మెంట్, సొంత ఇంటి కార్మికులకు 100 యూనిట్ల విద్యుత్ చార్జీల చెల్లింపు, గని ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్, కోలిండియాలో లేని విధంగా సింగరేణిలో మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాలు, మహిళా కార్మికులకు చైల్డ్ కేర్ లీవ్, సింగరేణి మెడికల్ కళాశాల, సింగరేణి పిల్లలకు 5 శాతం రిజర్వేషన్, వృత్తి పన్ను శాశ్వతంగా రద్దు టీబీజీకేఎస్ అమలు చేసిందని చెప్పారు. అనేక హక్కులు సాధించామని, మరిన్ని హక్కులు సాధిస్తామని పేర్కొన్నారు. కార్మికులు ఈ విషయాన్ని గ్రహించి, టీబీజీకేఎస్ బాణం గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు. టీబీజీకేఎస్ కాసిపేట-2 ఇంక్లైన్ పిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సారంగపాణి, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ సెగ్గం శ్రీనివాస్, మస్కూ రమేశ్, రాజేందర్, రాజు, పోశం, మణిబాబు, శ్రావణ్, అశోక్, శివ, సాజన్, సల్మాన్, కార్మికులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం

కోటపల్లి, డిసెంబర్ 16 : విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరమని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణమూర్తి, రాజ్ కుమార్ అన్నారు. పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ప్రార్థన సమయంలో సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హెచ్ఎం గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధికి, విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించి గొప్పగా ఎదిగేందుకు తమ తల్లిదండ్రుల సహకారం ఎంతో విలువైనదని వారు పేర్కొన్నారు. పాఠశాల ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించడంతో పాటు అవసరమైన సూచనలు చేయాలని, విద్యార్థులు ప్రతి రోజూ తరగతులకు హాజరవడంతో పాటు, విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేలా చూడాలన్నారు. పాఠశాలకు సక్రమంగా వస్తున్న, చుట్టు పక్కల గ్రామాల నుంచి కాలినడకన వస్తున్న, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ పూరెళ్ల వెంకటలక్ష్మి, ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో తిరుపతి రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీనాథ్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

## విజయవంతం చేయండి

చెన్నూర్, డిసెంబర్ 16 : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 21న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ పేర్కొన్నారు. శనివారం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటుకు మాదిగలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి లక్షలాదిగా తరలివచ్చి విజయ వంతం చేయాలని కోరారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట తప్పిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, మాదిగలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు శ్రావణ్, ప్రశాంత్, శేఖర్, నరేందర్, శ్రీధర్, లచ్చన్న, రాజు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

■ మందమర్రి ఏరియా జీఎం మనోహర్

■ 3వ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ స్కూల్ లీగ్ ప్రారంభం


క్రీడా కారులను పరిచయం చేసుకుంటున్న జీఎం మనోహర్

రామకృష్ణాపూర్, డిసెంబర్ 16 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. 3వ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ స్కూల్ లీగ్-2023 అండర్-17 విభాగం పోటీలను శనివారం మందమర్రి సింగరేణి హై స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి జీఎం పోటీలను ప్రారంభించారు. 15 బాలికల జట్లు, 10 బాలుర జట్లు (250 మంది క్రీడాకారులు) హాజరయ్యాయి. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, హ్యాండ్ బాల్ స్టేట్ ప్రెసిడెంట్ గోనె శ్యాంసుందర్ రావు, అసోసియేషన్ సెక్రటరీ కనపర్తి రమేశ్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ధైర్యంగా విధులు నిర్వర్తించాలి

■ మందమర్రి సీఐ జీ మహేందర్‌రెడ్డి


వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, డిసెంబర్ 16 : పోలీసు సిబ్బంది వృత్తిగత క్రమశిక్షణ కలిగి ఉండి, అసాంఘిక చర్యలు జరుగకుండా ధైర్యంగా విధులు నిర్వర్తించాలని మందమర్రి సీఐ జీ మహేందర్‌రెడ్డి సూచించారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వారాంతపు సమావేశం నిర్వహించారు. అలాగే పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగిన సందర్భంగా పోలీస్ సిబ్బందికి రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అభినందనలు తెలిపారన్నారు. సిబ్బంది విధిగా రోజులో ఏదో ఒక ఆట తప్పని సరిగా ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ చంద్రకుమార్, రామకృష్ణాపూర్ అదనపు ఎస్ఐ తానాజీ, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.